నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | నల్లగొండ, శనివారం 3 మే 2025 | YADADRI BHUVANAGIRI

మేము దివ్యాంగులం.. మాకు ఇల్లు ఇప్పించండి సారూ

రేకుల షెడ్డు వద్ద కలమ్మ, అంజయ్య

రామన్నపేట, మే 2 : 'మేమిద్దరం దివ్యాంగులం. మాకు ఇల్లు లేక రోడ్డు పక్కన రేకుల షెడ్డు వేసుకొని ఉంటున్నాం. దయచేసి మాకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించి ఆదుకోండి సారూ' అంటూ మండలంలోని బోగారం గ్రామానికి చెందిన కూనూరు కలమ్మ, అంజయ్య దంపతులు కోరుతున్నారు. కలమ్మ మానసిక దివ్యాంగురాలు. కాగా, అంజయ్య కొంతకాలం క్రితం కాలు కోల్పోయాడు. నిరుపేదలైన వీరు గ్రామంలోని రోడ్డు పక్కన రేకుల షెడ్డు వేసుకొని, అందులో చిన్న గాలి పంపు పెట్టుకొని టైర్లకు పంచర్లు వేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇటీవల అంజయ్య ఆరోగ్యం బాగాలేకపోవడంతో కుటుంబం గడవడం కష్టంగా మారింది. వర్షం వస్తే ఇంట్లో పడుకునే పరిస్థితి లేదని వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని వేడుకుంటున్నారు.

సన్న బియ్యం మళ్లీ లేట్

85 శాతం రేషన్ షాపులకు చేరని వైనం

కేటాయింపులో ఆలస్యం చేసిన ప్రభుత్వం

610 షాపులకు గానూ ఇప్పటివరకు 88 షాపులకే..

రేషన్ దుకాణాల చుట్టూ తిరిగి వెళ్తున్న లబ్ధిదారులు

పేదలకు అందించే రేషన్ బియ్యం పంపిణీలో మళ్లీ జాప్యం జరుగుతున్నది. ప్రతి నెలా 20 నుంచి 5వ తేదీ వరకు గోదాముల నుంచి ప్రతి రేషన్ దుకాణానికి బియ్యం పంపిణీ జరుగాల్సి ఉండగా, ఇప్పటికీ జిల్లాలో 15 శాతం షాపులకు కూడా బియ్యం చేరలేదు. సూర్యాపేట జిల్లావ్యాప్తంగా 610 రేషన్ షాపులు ఉండగా, ఇప్పటివరకు కేవలం 88 షాపులకే బియ్యం చేరింది.

– సూర్యాపేట, మే 2 (నమస్తే తెలంగాణ)

సూర్యాపేటలో సన్న బియ్యం కోసం బారులుతీరిన జనం

ఆరంభ శూరత్వం అన్నట్లు మొదట్లో హడావుడి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆపై అన్ని రంగాల్లోనూ ఫెయిల్ అవుతున్నది. రుణమాఫీ, రైతుబంధు, ఇందిరమ్మ ఇళ్లు ఏ పథకం తీసుకున్నా అదే పరిస్థితి. పేదలకు సన్నబియ్యం అంటూ ప్రారంభించిన నెల రోజుల్లోనే పంపిణీలో ఆలస్యం నెలకొంటున్నది. ప్రతి నెలా గోదాముల నుంచి రేషన్ షాపులకు 20వ తేదీ నుంచి పదిహేను రోజుల్లో విడుతల వారీగా బియ్యం సరఫరా అవుతాయి. ఈ నెల రెండో తేదీ పూర్తవగా, ఇప్పుడిప్పుడే సరఫరా ప్రారంభమవుతున్నది. ఒకటి నుంచి 15 వరకు రేషన్ షాపుల నుంచి కార్డు హోల్డర్లకు డీలర్లు పంపిణీ చేయాల్సి ఉండగా గోదాముల నుంచి బియ్యం రాక డీలర్లు, వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. బియ్యం వస్తున్న లబ్ధిదారులకు సమాధానం చెప్పలేకపోతున్నామని డీలర్లు వాపోతున్నారు. సూర్యాపేట నియోజకవర్గంలో 171 రేషన్ షాపులు ఉండగా ఇప్పటికి 23 షాపులకే బియ్యం చేరింది. కోదాడలో 146 షాపులకు గానూ 21, తుంగతుర్తిలో 105 షాపులకు 5, హుజూర్‌నగర్‌లో 188 షాపులకు 39 షాపులకే బియ్యం అయ్యింది. ప్రతి నెల 15 నుంచి 19 మధ్య ప్రభుత్వం నుంచి డైనమిక్ కీ రిజిస్టర్ రానుండగా ఈసారి ఏప్రిల్ 30న రావడం వల్ల సరఫరా ఆలస్యమైనట్లు పౌరసరఫరాల అధికారులు చెప్తున్నారు. మూడు, నాలుగు నెలలకు సరిపడా మాత్రమే గోదాముల్లో సన్నబియ్యం ఉన్నట్లు తెలుస్తుండగా, ఖజానా ఖాళీగా ఉందంటున్న ప్రభుత్వం ఆ తర్వాత సన్న బియ్యం ఎలా సమీకరిస్తుంది, ఎలా పంపిణీ చేస్తుందనేది ప్రశ్నార్థకంగా మారింది. బియ్యం పంపిణీలో జాప్యంపై జిల్లా పౌర సరఫరాల అధికారి రాజేశ్వర్‌ను నమస్తే తెలంగాణ వివరణ కోరగా.. 'కొన్నిసార్లు ఆలస్యమవడం సాధారణ విషయమే. పంపిణీ లేట్ ప్రారంభమైనా ప్రతి రేషన్ కార్డుదారుకూ బియ్యం అందిస్తాం' అని చెప్పుకొచ్చారు.


మిర్యాలగూడ పట్టణంలోని కేసీఆర్ కళాభారతి ఎదుట నిరసనలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు, చిత్రంలో జయసింహారెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులు

అభివృద్ధి చేయరు.. చేసినవి తొలగిస్తారా?

- ప్రజాస్వామ్యంలో అధికారం శాశ్వతం కాదు
- మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు
- కేసీఆర్ కళాభారతిలో కేసీఆర్ పేరు తొలగించడంపై నిరసన

మిర్యాలగూడ, మే 2 : ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని, ఏ పార్టీ శాశ్వతంగా అధికారంలో ఉండదని, అభివృద్ధి చేయకుండా చేసిన అభివృద్ధి ఆనవాళ్లు చెరిపేయడం మంచి పద్ధతి కాదని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. మిర్యాలగూడ పట్టణంలోని ఎన్ఎస్పీ క్యాంపులో నిర్మించిన కేసీఆర్ కళాభారతిలో కేసీఆర్ పేరు తొలగించడాన్ని నిరసిస్తూ శుక్రవారం భాస్కర్‌రావు బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి కేసీఆర్ కళాభారతి ఎదుట, అనంతరం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఆ తర్వాత మున్సిపల్ కమిషనర్‌కు, సబ్ కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్‌రావు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు పోటీపడి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని, అంతేగాని గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి ఆనవాళ్లు తొలగించడం ప్రజాస్వామ్యంలో మంచి సంస్కృతి కాదని అన్నారు. అధికారంలో ఉన్నాం మారుస్తాం, తొలగిస్తామని అనుకుంటే మిర్యాలగూడ పేరును పిడుగురాళ్ల, దాచేపల్లి మార్చుకోండని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం కట్టారని, ఇప్పుడు తమరు ఖాళీ చేస్తారా అని ప్రశ్నించారు. కేసీఆర్ కళాభారతి రాష్ట్రంలో వరంగల్ తర్వాత అత్యంత సుందరంగా నిర్మించిన కళావేదిక అని తెలిపారు. నాటి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఒప్పించి రూ.10కోట్లు తీసుకొచ్చి కళాభారతి నిర్మించినట్లు చెప్పారు. కేసీఆర్ పేరు తొలగించినంత మాత్రాన ప్రజల నుంచి ఆయన దూరం కారని, ఇలాంటి చిల్లర రాజకీయాలు చేయడం మంచిది కాదని హితవు పలికారు. గత ప్రజాప్రతినిధులు వారి నాయకుల పేర్లు అభివృద్ధి పనులకు పెట్టుకున్నారని, తన హయాంలో వాటిపై ఎటువంటి అభ్యంతరాలు తెలుపలేదని వివరించారు. యాదాద్రి పవర్ ప్లాంట్‌లో ప్రస్తుత పాలకులు ఇసుక, కంకర మాఫియా చేస్తున్నారని ఆరోపించారు. రూ.2కోట్లతో షాదీఖానా నిర్మించేందుకు నిధులు మంజూరు చేయించి శంకుస్థాపన చేశానని, పట్టణంలోని తడకమళ్ల రోడ్డు తాళ్లగడ్డకాలనీ వరకు నాలుగు లైన్ల రోడ్డుగా విస్తరించేందుకు నిధులు మంజూరు చేయించామని, కానీ ఇప్పటివరకు పనులు ప్రారంభించలేదని అన్నారు. 2014 నుంచి 2023 వరకు మిర్యాలగూడ నియోజకవర్గంలో రూ.2,971.14కోట్లతో పలు అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కాలం దాటినా ఇంతవరకు ఎటువంటి అభివృద్ధి పనులు చేయలేదని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో రూ.5కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్, రూ.16 కోట్లతో ఏరియా ఆసుపత్రిలో వంద పడకల భవన నిర్మాణానికి పనులు చేపట్టగా 70శాతం పూర్తయ్యాయని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. అధికారులు ఇప్పటికైనా కళావేదికకు కేసీఆర్ కళావేదిక పేరు అమర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, రైతు బంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిట్టిబాబునాయక్, నాయకులు యడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, పాలుట్ల బాబయ్య, మట్టపల్లి సైదులు యాదవ్, ఇలియాస్, మోసిన్‌అలీ, మాజీద్, మగ్దూం పాషా, చిర్ర మల్లయ్యయాదవ్, ఎండీ షోయబ్ తదితరులు పాల్గొన్నారు.

4న నీట్

- ఉమ్మడి జిల్లాలో ఏర్పాట్లు పూర్తి
- నల్లగొండ జిల్లాలో 7, సూర్యాపేట జిల్లాలో 4 పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న 2,977 మంది విద్యార్థులు
- మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎగ్జామ్
- అర్ధగంట ముందే గేట్లు మూసివేత

రామగిరి/సూర్యాపేట, మే 2 : వైద్య విద్యలో ప్రవేశానికి నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రన్స్ టెస్ట్(నీట్)-2025 ఈ నెల 4న నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో 7 సెంటర్లు ఏర్పాటు చేయగా 2,087, సూర్యాపేట జిల్లా కేంద్రంలో 4 సెంటర్లు ఏర్పాటు చేయగా 890 మంది పరీక్ష రాయనున్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరుగనుండగా ఉదయం 11 గంటల నుంచి విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించనున్నారు. మధ్యాహ్నం 1:30 తర్వాత పరీక్ష కేంద్రం గేట్లు మూసివేస్తారు. పరీక్ష హాల్‌లోకి ఎంట్రీ కాగానే విద్యార్థి బయోమెట్రిక్ తీసుకుంటారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు పెన్ను అందజేస్తారు. వాటితోనే పరీక్ష రాయాలి. ఈ సందర్భంగా నల్లగొండ, సూర్యాపేట కలెక్టర్లు మీడియా సమావేశంలో శుక్రవారం నీట్ ఏర్పాట్లపై వివరాలు వెల్లడించారు. విద్యార్థులు తప్పనిసరిగా అడ్మిట్ కార్డుతోపాటు ఏదైనా గుర్తింపు కార్డును తీసుకురావాలని తెలిపారు. పరీక్ష కేంద్రానికి ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్‌లు, పర్సులు, కలర్‌ఫుల్ దుస్తులు, బంగారు అభరణాలు అనుమతించరని చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద నిరంతర విద్యుత్ ఉండాలని, సెంటర్లలో ఫస్ట్ ఎయిడ్ సెంటర్ ఏర్పాటు చేసి ఓఆర్ఆర్ ప్యాకెట్స్, మందులు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఏమైనా సందేహాలుంటే టోల్ ఫ్రీ నంబర్ 1800 425 1442లో సంప్రదించాలని తెలిపారు. నల్లగొండలో జరిగిన సమావేశంలో అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ రాజ్‌కుమార్, నీట్ నోడల్ అధికారి, కేవీ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, డీపీఆర్ఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాలు ఇవే..

నల్లగొండ జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్స్ కళాశాల(ఎంజీ యూనివర్సిటీ), యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ (ఎంజీ యూనివర్సిటీ), యూనివర్సిటీ సైన్స్ కళాశాల (ఎంజీ యూనివర్సిటీ), యూనివర్సిటీ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ(ఎంజీ యూనివర్సిటీ), నాగార్జున ప్రభుత్వ కళాశాల, నల్లగొండ, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, రామగిరి నల్లగొండ, కేంద్రీయ విద్యాలయం, మిర్యాలగూడ రోడ్డు, నల్లగొండ.. సూర్యాపేట జిల్లా కేంద్రంలో తెలంగాణ మోడల్ స్కూల్ ఇమాంపేట, టీజీఎస్‌డబ్ల్యూర్ స్కూల్ అండ్ కాలేజ్ (బాలికలు) ఇమాంపేట, తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ దురాజ్‌పల్లి, ప్రభుత్వ జూనియర్ కళాశాల సూర్యాపేటలో పరీక్షలు నిర్వహించనున్నారు.

ఈదురుగాలులకు నేలవాలిన వరి

- విరిగిపడ్డ చెట్లు.. విద్యుత్ స్తంభాలు
- పలుచోట్ల తడిసిన ధాన్యం

మర్రిగూడలో గాలివానకు నేలకొరిగిన వరిచేను

కొండమల్లేపల్లి/మర్రిగూడ/భువనగిరి కలెక్టరేట్, మే 2 : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పలుచోట్ల శుక్రవారం సాయంత్రం ఉరుములు , మెరుపులు ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దాంతో అక్కడక్కడ చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ స్తంభాలు కూలాయి. ఇండ్లు, షెడ్ల రేకులు గాలికి ఎగిరిపడ్డాయి. వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. కోతకొచ్చిన వరిపొలాలు నేలవాలాయి. అన్నదాతకు అకాల వర్షం తీవ్ర నష్టం కలిగించింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కొండమల్లేపల్లి పట్టణంలోని పాతవూరలో చెట్ల కొమ్మలు విరిగాయి. 33 కేవీ విద్యుత్ లైన్ స్తంభం కూలి వైర్లు ఇంటిమీద పడ్డాయి. మండలంలోని చిన్నఅడిశర్లపల్లిలో రేకుల షెడ్డు గాలికి ఎగిరిపోయింది. మర్రిగూడ మండలకేంద్రంతోపాటు పలు గ్రామాల్లో కోతకు వచ్చిన వరిచేలు నేలవాలాయి. 50 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు తెలుస్తున్నది. భువనగిరి మండలంలోని బీఎన్ తిమ్మాపురంలో సెల్ టవర్ గాలికి కిందపడడంతోపాటు చెట్లు విరిగిపడ్డాయి. ఈ వర్షానికి వాతావరణం చల్లబడింది. కొన్ని రోజులుగా అత్యధిక ఉష్ణోగ్రతలతో ఇబ్బంది పడిన ప్రజలు కొంత ఉపశమనం పొందారు.

భువనగిరి కలెక్టరేట్ : బీఎన్ తిమ్మాపురంలో కూలిపోయిన సెల్ టవర్

ఆంధ్రా ధాన్యం లారీల పట్టివేత

- అక్కడ గిట్టుబాటు ధర లేక పోవడంతో తరలింపు?

దామరచర్ల, మే 2 : ఆంధ్రా నుంచి తెలంగాణకు వస్తున్న ఆరు ధాన్యం లారీలను పట్టుకొని కేసులు నమోదు చేసినట్లు వాడపల్లి ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. వాడపల్లి చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన క్యాంపు సిబ్బంది గురువారం ఐదు లారీలను, శుక్రవారం ఒక లారీని పట్టుకున్నారు. ఒక్కొక్క లారీలో సుమారు 300 క్వింటాళ్ల ధాన్యం ఉంటుందని పోలీసులు తెలిపారు. ఆంధ్రాలోని నర్సరావు పేట, ప్రకాశం, ఒంగోలు తదితర ప్రాంతాల నుంచి తెలంగాణకు ధాన్యాన్ని తరలిస్తున్నారు. గతంలో చెక్‌పోస్టు వద్ద ఆంధ్రా నుంచి వస్తున్న ధాన్యం లారీలను పట్టుకొని తిప్పిపంపేవారు. ధాన్యం దిగుమతిపై అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా వస్తున్న లారీలను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేస్తున్నారు. ఆంధ్రాలో ధాన్యానికి గిట్టుబాటు ధర అంతగా లేక పోవడంతో మిల్లర్లు, దళారులు క్వింటాకు రూ. 1,500 వరకు చెల్లిస్తున్నట్లు సమాచారం. తమిళనాడు, ఆంధ్రా రాష్ట్రాల నుంచి గతంలో తెలంగాణకు అధిక సంఖ్యలో ధాన్యాన్ని తరలించేవారు. దాంతో స్థానిక రైతుల వద్ద మిల్లర్లు ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో కొంత ఇబ్బందులు పెట్టేవారే. ఆంధ్రా నుంచి ప్రస్తుతం వస్తున్న ధాన్యం మిల్లులకు తరలిస్తున్నారా లేకుంటే ఐకేపీ కేంద్రాల్లో అమ్మేందుకు తీసుకొస్తున్నారా ?అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అంధ్రా నుంచి వచ్చిన ధాన్యం లారీలను, డ్రైవర్లను అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నామని, ధాన్యం ఎక్కడకు తరలిస్తున్నారనే విషయాన్ని తేలుస్తామని పోలీసులు చెప్పారు.

సమావేశంలో మాట్లాడుతున్న కవులు, రచయితలు, కళాకారులు

నల్లగొండలో కళాభారతి నిర్మించాలి

- గత ప్రభుత్వం రూ.90 కోట్లు కేటాయించింది
- రౌండ్ టేబుల్ సమావేశంలో కవులు, కళాకారులు

రామగిరి, మే 2: సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు నల్లగొండ జిల్లా కేంద్రంలో కళాభారతి నిర్మాణం తక్షణమే చేపట్టాలని పలువురు కవులు, కళాకారులు అభిప్రాయపడ్డారు. పట్టణంలోని టీఎన్‌జీఓ భవనంలో శుక్రవారం సాయంత్రం వారు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా కేంద్రమైన నల్లగొండలో సాంస్కృతిక కార్యక్రమాలకు తగిన వేదిక లేకపోవడం దురదృష్టకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మూడు దశాబ్దాలుగా కళాభారతి నిర్మాణం కోసం పోరాట జరుగుతుందని తెలిపారు. కోమలి కళా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బక్క పిచ్చయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వం కళాభారతి నిర్మాణానికి రూ.90 కోట్లు కేటాయించిందని, ఇప్పటి ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టాలని కోరారు. సృజన సాహితీ అధ్యక్షుడు పెరుమాళ్ల ఆనంద్ మాట్లాడుతూ కళా స్పృహ, సాహిత్య స్పృహ లేని సమాజం నిస్తేజంగా ఉంటుందన్నారు. సాహిత్యాన్ని కళలను పోషించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని చెప్పారు. తండు కృష్ణకౌండిన్య మాట్లాడుతూ ముందు తరాలకు సాహిత్య స్ఫూర్తిని అందించాలంటే నల్లగొండలో ఒక చక్కటి ఆడిటోరియం ఎంతైనా అవసరమని తెలిపారు. ఈ సమావేశంలో కవులు, రచయితలు బండారు శంకర్, పున్న అంజయ్య, కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, శీలం భద్రయ్య, గజవెల్లి సత్యం, సాగర్ల సత్తయ్య, కోమటి మధుసూదన్, రావిరాల అంజయ్య, రఘు, పోషం రఘుపతి, భాస్కర్, గంటేకంపు గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సంపులో పడి బాలుడి మృతి

మునుగాల, మే 2: మండలంలోని తిమ్మారెడ్డిగూడెం గ్రామంలో నీటిలో సంపులో పడి ఏడాదిన్నర బాలుడు మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గుంజ నాగరాజు, దుర్గ దంపతుల ఏకైక కుమారుడైన వీరాంజన్ శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో తల్లి ఇంట్లో పని చేసుకుంటుండగా ఆడుకుంటూ ఎదురింటికి వెళ్లాడు. అక్కడే ఆడుకుంటూ ప్రమాదవశాత్తు నీటి సంపులో పడిపోయాడు. ఆ ఇంట్లో ఎవరూ లేకపోవడంతో బాలుడిని గుర్తించలేకపోయారు. తల్లి ఎంత వెతికినా బాబు ఆచూకీ లభించకపోవడంతో ఎదురుగా ఉన్న ఇంట్లోకి వెళ్లి నీటి సంపులో చూడగా మృతిచెంది నీటిపై తేలియాడుతూ కనిపించాడు. వీరాంజన్ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

పెరోల్‌పై వచ్చి.. ఆరేండ్లుగా అడ్రస్ లేడు!

తప్పించుకు తిరుగుతున్న జీవిత ఖైదీని ఎట్టకేలకు పట్టుకున్న పోలీసులు

వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నరసింహ

సూర్యాపేట టౌన్, మే 2 : హత్య కేసులో జీవిత ఖైదీ పడ్డ ఓ వ్యక్తి పెరోల్‌పై వచ్చి ఆరేండ్లుగా తప్పించుకు తిరుగుతుండగా పోలీసులు పట్టుకున్నారు. దానికి సంబంధించిన వివరాలను శుక్రవారం సూర్యాపేట జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె.నరసింహ మీడియాకు తెలిపారు. కోదాడ పోలీస్ డివిజన్ మఠంపల్లి గ్రామానికి చెందిన బొడ్డు తిరుపతి 2012లో రాచకొండ కమిషనరేట్ వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తిని హత్య చేసిన కేసులో ప్రధాన నిందితుడిగా అరెస్టు అయ్యాడు. విచారణ అనంతరం కోర్టు తిరుపతికి జీవిత ఖైదు విధించగా శిక్షను అమలు చేసేందుకు చర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించారు. అక్కడ జైలులో సీ క్లాస్ ఖైదీగా శిక్ష అనుభవిస్తున్న తిరుపతి 2019 ఆగస్టు 17న 30 రోజుల పెరోల్‌పై విడుదలయ్యాడు. అనంతరం చర్లపల్లి జైలుకు రాకుండా కోర్టు విధించిన శిక్షను గౌరవించకుండా ఆరేండ్లుగా తప్పించుకు తిరుగుతున్నాడు. పరారీలో ఉన్న ఈ ఘటనపై చర్లపల్లి జైలు సూపరింటెండెంట్ నివేదిక ఆధారంగా మట్టపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కాగా ఐటీ విభాగానికి చెందిన ఆర్ఎస్ఐ రాజశేఖర్ సహకారంతో ఆధునిక డేటా బేస్, ట్రాకింగ్ సిస్టమ్‌ను వినియోగించి ఖైదీ ఆచూకీ కనుగొన్నారు. గుంటూరు జిల్లాలో నిందితుడు ఉన్నట్లు నిర్ధారణ కావడంతో కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక టీమ్ సీఐ చరమందరాజు, ఎస్ఐ బాబు, కానిస్టేబుల్ ఎం.రామారావు, శంబయ్య కలిసి తిరుపతిని అక్కడ అరెస్టు చేశారు. విచారణలో బొడ్డు తిరుపతి తన అసలైన గుర్తింపును పూర్తిగా మార్చుకొని గ్రామం, కుటుంబ సభ్యులతో సంబంధాలు ఆపేసి గుంటూరులోని హోటల్లో పని చేస్తూ స్థానికంగా ఉండే మహిళను వివాహం చేసుకున్నాడు. అక్కడే స్థిరపడి తన గతాన్ని రహస్యంగా ఉంచి పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు ప్రయత్నించాడు. ఈ కేసులో కీలకంగా పని చేసిన పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ రివార్డ్సు అందించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ నాగేశ్వర్ రావు, డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు, మఠంపల్లి ఎస్ఐ రాజు, ఐటీ కోర్ ఆర్ఎస్ఐ రాజశేఖర్ ఉన్నారు.

ఏదీ యాంత్రీకరణ?

వ్యవసాయ రంగంలో అమలుకు నోచని సబ్సిడీ పథకం

- దరఖాస్తుల స్వీకరణకే పరిమితం
- పత్తాలేని యంత్రాలు, పరికరాల కొనుగోలు
- నిధుల కొరతతో ఆదిలోనే బ్రేక్
- ఆశగా ఎదురుచూస్తున్న మహిళా రైతులు
- పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

యాదాద్రి భువనగిరి, మే 2 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వం ఆర్భాటంగా తీసుకొచ్చిన వ్యవసాయ యాంత్రీకరణ పథకం ఆదిలోనే అడుగు ముందుకు పడడం లేదు. మహిళా రైతులకు సబ్సిడీపై యంత్రాలు, పరికరాలు అందించే స్కీమ్ ప్రారంభం కాకముందే అటకెక్కింది. హడావుడిగా దరఖాస్తులు స్వీకరించినా, నిధులు లేకపోవడంతో ఆచరణలో అమలు చేయడం లేదు.

వ్యవసాయ రంగంలో యంత్రాల వినియోగం రోజురోజుకూ పెరుగుతున్నది. దాంతో సబ్సిడీపై యంత్రాలు, పరికరాలను అందించాలని వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. మహిళా రైతులకు అందించాలని నిర్ణయించి, ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా కార్యాచరణతోపాటు, కేటాయింపులు కూడా చేసింది.

దరఖాస్తుల దశలోనే..

వ్యవసాయ యాంత్రీకరణ పథకం కోసం అర్హులైన రైతుల నుంచి వ్యవసాయ అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. మార్చిలో ఈ ప్రక్రియ పూర్తయింది. వందల సంఖ్యలో అప్లికేషన్లు వచ్చాయి. అర్హుల జాబితా తర్వాత లబ్ధిదారుల నుంచి డీడీలు తీసుకోవాల్సి ఉంది. వ్యవసాయ అధికారులు గుర్తించిన రైతులు 50శాతం సబ్సిడీతో యంత్రాలు, పనిముట్లు కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది. కానీ ప్రభుత్వం నుంచి ఇప్పటివరకూ ఎలాంటి పురోగతి కూడా లేదు.

నిధుల లేమి..

పథకం అమలైతే 14 రకాల యంత్ర పరికరాలు 50 శాతం సబ్సిడీతో మహిళా రైతులకు అందే అవకాశం ఉంది. పవర్ స్ప్రేయర్లు, చేతి పంపులు, డ్రోన్లు, రోటోవేటర్లు, విత్తనాలు/ఎరువులు చల్లే పరికరాలు, ట్రాక్టర్‌తో దమ్ము చేసే పరికరాలు, పవర్ టిల్లర్లు, ఎద్దులతో బోదలు పోసే పరికరాలు, ట్రాక్టర్లతో బోదలు పోసే పరికరాలు, పవర్ రీడర్స్, బ్రష్ కట్టర్స్, ట్రాక్టర్లు, మొక్కజొన్న కోత పరికరాలు, గడ్డి చుట్టే యంత్రాలు సబ్సిడీలో లభించనున్నాయి.

యాదాద్రి భువనగిరి జిల్లాలో 247 పరికరాలకు రూ.72 లక్షలు, సూర్యాపేటలో 457 పరికరాలక కోటి రూపాయలు, నల్లగొండ జిల్లాలో 820 పరికరాలకు రూ.1.80 కోట్లు మంజూరు కూడా అయ్యాయి. కానీ, ప్రభుత్వం పథకాన్ని అమలు చేయపోవడానికి నిధుల లేమే కారణంగా తెలుస్తున్నది.

రైతులకు మరో దోఖా!

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతు రాజ్యం తీసుకొస్తామని అసెంబ్లీ ఎన్నికల ముందు ఎన్నో హామీలు గుప్పించింది. తీరా పాలన పగ్గాలు చేపట్టాక అన్నదాతలకు మొండిచెయ్యి చూపున్నది. సగం మందికి కూడా రుణమాఫీ చేయలేదు. రైతు భరోసా పథకం కింద ప్రతి ఎకరాకు సీజన్ రూ.7,500 చొప్పున ఏడాదికి 15 వేలు పంట పెట్టుబడి సాయం అందిస్తామని హామీ ఇచ్చింది. కౌలు రైతులకు కూడా ఇస్తామని చెప్పింది. కానీ కేవలం ఎకరాకు రూ. 5 వేల చొప్పున మాత్రమే విడుదల చేసింది. అది కూడా ఒక్క సీజన్‌కే ఇచ్చింది. కౌలు రైతుల ప్రస్తావనే లేదు. వానకాలం పంటకు రైతు భరోసా ఇవ్వలేదు. యాసంగి సీజన్‌లో సగం మందికి కూడా డబ్బులు జమ చేయలేదు. ఇప్పుడు యాంత్రీకరణ పథకాన్ని కూడా ఆ దారిలోకి నెడుతున్నట్లు స్పష్టమవుతున్నది.